

కిలేడి

అధిక వడ్డీ ఆశ చూపిన ఓ కిలాడీ లేడి రైతు దంపతుల వద్ద నుంచి రూ.41.40 లక్షలు తీసుకుంది. తీసుకున్న డబ్బు ఇవ్వాలని అడిగితే డబ్బు ఇవ్వలేదంటూ బుకాయిస్తుంది. 8లో

రైతుల ఖాతాల్లో ధాన్యం డబ్బులు జమ

సంగారెడ్డి టౌన్: ధాన్యం అమ్మిన రైతుల ఖాతాల్లో రూ.108 కోట్లు జమయ్యాయని కలెక్టర్ డాక్టర్ శరత్ శుక్రవారం తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 1,09752 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందన్నారు. రైతులకు ముందుగా రూ.58 కోట్లు, శుక్రవారం మరో రూ.50 కోట్లు వారి ఖాతాల్లో జమ చేశామన్నారు.

అందరికీ నెగెటివ్

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి లో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం 12 మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించారు. అందులో అందరికీ నెగెటివ్ వచ్చిందని నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. అదేవిధంగా ఆర్టీపీసీఆర్ టెస్టులు చేయలేదన్నారు.

అభివృద్ధి పరుగులు



సాంస్కృతిక కార్యక్రమం

- మాంద్యం, కరోనా సంక్షోభాలను తట్టుకుని నిలబడింది
- నిరాటంకంగా సంక్షేమ పథకాల కొనసాగింపు
- రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో హోంశాఖ మంత్రి మహమూద్‌అలీ



నగారా మోగిస్తున్న హోం మంత్రి మహమూద్ అలీ


సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: ఆర్థిక మాంద్యం, కరోనా సంక్షోభాలను తట్టుకుని తెలంగాణ రాష్ట్రం బలీయమైన ఆర్థిక శక్తిగా నిలబడిందని రాష్ట్ర హోంశాఖ మంత్రి ఎండీ మహమూద్‌అలీ అన్నారు. సమర్థవంతమైన ఆర్థిక నిర్వహణ చేస్తూ సంక్షేమ పథకాలను నిరాటంకంగా అమలు చేయడం ఒక్క తెలంగాణ రాష్ట్రంతోనే సాధ్యమైందన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగిన తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఆయన జిల్లా ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. మానవీయ దృక్పథం, నిర్మాణాత్మక ఆలోచన, దార్శనికమైన ప్రణాళిక, పారదర్శక పాలన మేలు కలయికగా తెలంగాణ మోడల్ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మన్ననలు పొందుతోందన్నారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధిని వివరించిన మంత్రి తర్వాత జిల్లాలో అమలవుతున్న వివిధ సంక్షేమ పథకాలను వివరించారు. తెలంగాణ కంటే ముందున్న పరిస్థితులు, ఈ తొమ్మిదేళ్ల పాలనలో అమలవుతున్న పథకాల తీరును వెల్లడించారు. తెలంగాణ తలసరి ఆదాయం వృద్ధి రేటు 11.8 శాతం నమోదై దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంగా నీతి ఆయోగ్ తన నివేదికలో పేర్కొందన్నారు. దేశ జనాభాలో 2.9 శాతం ఉన్న తెలంగాణ దేశ జీడీపీలో 4.1 శాతం వాటా ఉందని విశ్లేషించారు.

రైతుబంధుతో 3.24 లక్షల మందికి లబ్ధి

జిల్లాలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను మంత్రి వివరించారు. పథకాల వివరణ ఆయన మాటల్లోనే ×రైతుబంధు పథకం పది విడతలలో 3.24 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.3,272 కోట్లు జమ చేశామన్నారు. రైతుబీమా పథకంలో మరణించిన ఆరు వేల మంది రైతు కుటుంబాల ఖాతాల్లో రూ.309 పరిహారం జమ చేశామని తెలిపారు. ఈ యాసంగి సీజనులో 1.87 లక్షల లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, జిల్లా వ్యాప్తంగా 116 రైతువేదికలను నిర్మించామన్నారు.

దళిత బంధు

దళితబంధు పథకంలో భాగంగా నియోజకవర్గానికి 444 మంది లబ్ధిదారులకు ఒకొక్కరికి రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించామన్నారు. 500 జనాభా దాటిన 81 గిరిజన తండాలను పంచాయతీలుగా మార్చామని తెలిపారు.



జిల్లా ప్రగతిని వివరిస్తున్న హోం మంత్రి మహమూద్ అలీ

పేదల సంక్షేమ పథకాలు

ఆడపిల్లల వివాహాలు భారం కాకూడదనే ఉద్దేశంతో అమలు చేస్తున్న కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకంలో ఇప్పటి వరకు 39 వేల మంది లబ్ధిపొందారని తెలిపారు. ఆరోగ్యలక్ష్మి పథకాన్ని నీతి ఆయోగ్ ప్రశంసించిందన్నారు. ఐదేళ్లలోపు పేద పిల్లలకు పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు బాలామృతం ప్లస్‌ను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. మైనార్టీల సంక్షేమం కోసం రంజాన్, క్రిస్మస్ పండగలకు కానుకల పంపిణీ చేపట్టామన్నారు.



ఎత్తిపోతల పథకాలు.. విద్యుత్ సరఫరా

3.84 లక్షల ఎకరాలకు సాగునీరందించేందుకు రూ.4,427 కోట్లతో సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకాలకు శ్రీకారం చుట్టామన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో వ్యవసాయానికి ఉచితంగా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తున్నామని, జిల్లాలో 1.07 లక్షల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయని తెలిపారు.

తాగునీరు.. ఆసరా పెన్షన్లు

మిషన్ భగీరథ పథకంలో భాగంగా రూ.1,689 కోట్లతో జిల్లాలోని 944 నివాసిత ప్రాంతాలకు తాగునీటిని సరఫరా చేస్తున్నామన్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థలో భాగంగా ఇప్పటి వరకు ఉచిత బియ్యం కోసం రూ.1,094 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. ఆసరా పింఛన్లను రూ.200 నుంచి రూ.2,016కు పెంచామని.. ఈ పెన్షన్ల కోసం ఏటా రూ.432 కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు.

బీసీ సంక్షేమం కోసం..

బీసీ సంక్షేమంలో భాగంగా రూ.187 కోట్లతో 19 వేల మంది లబ్ధిదారులకు సబ్సిడీపై గొర్రెల పంపిణీ చేశాం. మత్స్యకారుల అభివృద్ధి కోసం ఉచిత చేపపిల్లల పంపిణీ చేపట్టామన్నారు. గత ఏడాది 18 వేల మెట్రిక్ టన్నుల చేపల దిగుబడి వచ్చిందన్నారు. మద్యం దుకాణాల కేటాయింపుల్లో గౌడ సామాజికవర్గానికి 15 శాతం రిజర్వేషన్ వర్తింప చేశామని వెల్లడించారు. జిల్లాలో తొమ్మిది మద్యం షాపులు వీరికి వచ్చాయి. బీసీ రెసిడెన్సియల్ స్కూల్‌లను 12కు పెంచామన్నారు.

పర్యావరణ పరిరక్షణకు..

పర్యావరణ పరిరక్షణలో భాగంగా తెలంగాణలకు హరితహారం మొక్కలు నాటే కార్యక్రమానికి చేపట్టడం ద్వారా రాష్ట్రంలో పచ్చదనం 7.70 శాతానికి పెరిగిందన్నారు. మన ఊరు.. మన బడి కార్యక్రమంలో భాగంగా తొలి విడతలో 441 పాఠశాల్లో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు.

దేశంలోనే అత్యున్నత వైద్య సేవలు

అత్యున్నత వైద్య సేవలందించే రాష్ట్రంగా తెలంగాణ పేరు పొందింది. రాష్ట్ర సర్కారు కృషి కారణంగా జిల్లాలో మాతా, శిశుమరణాల రేటు గణనీయంగా తగ్గింది. కంటి వెలుగు కార్యక్రమంలో 10.17 లక్షల మందికి కంటి పరీక్షలు చేశామని తెలిపారు. జిల్లా కేంద్రంలో మెడికల్ కాలేజీని ప్రారంభించామన్నారు.

పల్లె ప్రగతి

పల్లె ప్రగతితో జిల్లాలోని 647 గ్రామాలను సకల మౌలిక వసతులతో పరిశుభ్రతతో పచ్చదనంతో కళకళలాడేలా చేసిందన్నారు. పంచాయతీరాజ్ రోడ్ల మరమ్మత్తుల కోసం రూ.164 కోట్లు ఖర్చు చేశామని, పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా ఎనిమిది మున్సిపాలిటీలకు రూ.78 కోట్లు ఖర్చు చేశాం. రహదారులు, భవనాల శాఖ ద్వారా పీరియాడికల్ రెన్యువల్స్ కోసం 967 కిలోమీటర్ల రోడ్లకు రూ.734 కోట్లు మంజూరయ్యాయి.

పారిశ్రామికంగా..

పారిశ్రామిక అభివృద్ధిలో భాగంగా టీఎస్‌ఐపాస్ జిల్లాలో 2,573 పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేశాం. మెరుగైన శాంతిభద్రతల నిర్వహణ కారణంగా రాష్ట్రానికి పెట్టుబడులు తరలివస్తున్నాయి. రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు దేశంలోనే అత్యధిక వేతనాలు పొందుతున్నారు. ఉద్యోగాల భర్తీలో భాగంగా ఇప్పటి వరకు 1.41 లక్షల పోస్టుల ఎంపిక ప్రక్రియ పూర్తయ్యింది. అనేక సవాళ్లు, అవరోధాల నడుమ తెలంగాణ ప్రగతి ప్రస్థానం స్ఫూర్తిదాయకంగా కొనసాగుతోంది\ అని మహమూద్ అలీ పేర్కొన్నారు. అంతకు ముందు పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. దశాబ్ది వేడుకల్లో ఎంపీ బీబీపాటిల్, ఎమ్మెల్యేలు చంటి క్రాంతికిరణ్, భూపాల్‌రెడ్డి, మాణిక్‌రావు, జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డి, హెచ్‌డీసీ రాష్ట్ర చైర్మన్ చింతా ప్రభాకర్, కలెక్టర్ డాక్టర్ శరత్, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరిరెడ్డి, అదనపు కలెక్టర్ వీరారెడ్డి పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే అంతర్జాతీయ గుర్తింపు

- బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నీలం మధుముదిరాజ్



హోంమంత్రి చేతుల మీదగా సర్టిఫికెట్‌ను అందుకుంటున్న నీలం మధు ముదిరాజ్

పటాన్‌చెరు టౌన్: ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి చేసే గ్రామపంచాయతీలను ప్రభుత్వం గుర్తించి సర్పంచ్‌లను గౌరవించడం బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కిందని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ తెలిపారు. శుక్రవారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించిన రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలలో భాగంగా రాష్ట్ర హోం శాఖ మంత్రి మహమ్మద్ అలీ, జిల్లా కలెక్టర్ శరత్, జెడ్పీ చైర్మన్ మంజుశ్రీ చేతుల మీదుగా ఉత్తమ పనితీరు కనబర్చినందుకు గ్రామ పంచాయతీ తరుపున సర్పంచ్ నీలం మధు ముదిరాజ్ కు హెచ్‌వైఎం అంతర్జాతీయ గుర్తింపు ప్రశంసా పత్రం ఇచ్చి సత్కరించారు. ఈ సందర్భంగా నీలం మధు ముదిరాజ్ మాట్లాడుతూ గ్రామపంచాయతీలో మంచి పరిపాలనను ప్రజల భాగస్వామ్యంతో అందించినందుకు ఈ గుర్తింపులభించిందన్నారు. ఇది గ్రామస్తుల విజయమన్నారు. అందరూ సహకరించడంవల్లే ఇది సాధ్యమైందని, దీంతో మరింత బాధ్యత పెరిగిందన్నారు. ఇదే స్ఫూర్తితో నియోజకవర్గంలో అందరికీ సేవ అందించేలా అందరిని కలుపుకుని ముందుకు సాగుతాయని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలోనే ఇలాంటివి సాధ్యమవుతాయన్నారు. మరోసారి ఆయన ముఖ్యమంత్రి అయ్యేలా ప్రజలందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామపంచయతీ కార్యదర్శి కవిత, ఉపసర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి, వార్డు సభ్యులు కృష్ణ, మురళీ, వెంకటేష్, ఆంజనేయులు, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు ప్రశాంత్, మాజీ నీటి సంఘం చాకలి వెంకటేశ్, యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రామేశ్వరంబండ, కర్దనూర్‌లకు హెచ్‌వైఎం ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్

పటాన్‌చెరు మండల పరిధిలోని రామేశ్వరంబండ, కర్దనూర్ గ్రామాలకు కూడా హెచ్‌వైఎం ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా పొందిన ఐఎస్‌ఓ 9001–2015 సెర్టిఫికెట్‌ను సంగారెడ్డిలో రామేశ్వరంబండ సర్పంచ్ ధరణి అంతిరెడ్డి, అదేవిధంగా కర్దనూర్ సర్పంచ్ భాగ్యలక్ష్మి, కార్యదర్శి నీలిమ అందుకున్నారు. సర్టిఫికెట్ రావడంపై వారు హర్షం వ్యక్తం చేశారు.

రైతు దినోత్సవానికి రైతు వేదికలు ముస్తాబు

సంగారెడ్డి టౌన్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు గుర్తుండేలా కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ శరత్ అన్నారు. ఈ నెల 3వ తేదీన నిర్వహించనున్న తెలంగాణ రైతు దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా జిల్లాలోని 116 క్లస్టర్లలోని 116 రైతువేదికలను ముస్తాబు చేసినట్లు తెలిపారు. రైతు దినోత్సవం నాడు రైతువేదికలలో రాష్ట్ర అవతరణ నుంచి ఇప్పటి వరకు జరిగిన ప్రగతిని రైతులకు వివరిస్తారన్నారు. కార్యక్రమంలో ఆయా క్లస్టర్ పరిధిలోగల గ్రామాల రైతులు, రైతుబంధు సమితుల నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, మండల అధ్యక్షులు, ప్యాక్స్ చైర్మన్లు, వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు, మండల స్థాయిలోని వివిధ శాఖల అధికారులు, నాయకులు పాల్గొంటారని కలెక్టర్ తెలిపారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న బీజేవైఎం జాతీయ కార్యదర్శి శ్యామ్ రాజ్

కొండాపూర్(సంగారెడ్డి): కేంద్ర ప్రభుత్వం తొమ్మిది సంవత్సరాలుగా సాధించిన విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేవైఎం జాతీయ కార్యదర్శి, బీజేవైఎం తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి అన్నారు. శుక్రవారం సంగారెడ్డి లో బీజేవైఎం జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్యామ్‌రాజ్ మాట్లాడుతూ జూన్ 1 నుంచి 30వ తేదీ వరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న మహాజన సంపర్క అభియాన్ లో భాగంగా ప్రధాని మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం తొమ్మిది సంవత్సరాలలో సాధించిన విజయాలను రాష్ట్రంలో ప్రతీ ఇంటికి తీసుకెళ్లి వారికి వివరించాలని సూచించారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పవన్, బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంత్ కష్ణ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజేశ్వరరావు పాండే పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు కేంద్రమంత్రి రాక

జహీరాబాద్: ఈనెల 3వ తేదీన కేంద్ర పశుసంవర్ధక, పాడిపరిశ్రమ శాఖ మంత్రి పురుషోత్తం రూపాల జహీరాబాద్‌కు రానున్నట్లు బీజేపీ వర్గాలు తెలిపాయి. ఉదయం 8 గంటలకు హైదరాబాద్ నుంచి బయలుదేరి 10 గంటలకు జహీరాబాద్ చేరుకుంటారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం అవుతారు. అనంతరం సంగారెడ్డికి వెళతారు. అక్కడ జరిగే బీజేపీ కార్యకర్తల సమావేశంలో పాల్గొని తిరిగి హైదరాబాద్ బయలుదేరి చేరుకుంటారు.

రాష్ట్ర సాధనలో ఆర్టీసీ ఉద్యోగుల పాత్ర కీలకం

ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సుదర్శన్



జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సుదర్శన్

సంగారెడ్డి టౌన్: తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆర్టీసీ ఉద్యోగులు కీలక పాత్ర పోషించారని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ యస్.సుదర్శన్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా శుక్రవారం ఆర్టీసీ డిపోలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహనీయుల కృషి, ఆత్మబలిదానాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామన్నారు. రాష్ట్రంలో ఆర్టీసీ బలోపేతానికి ఉద్యోగులు కృషిచేయాలన్నారు.

ఎస్పీ కార్యాలయంలో ఘనంగా సంబురాలు



గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ రమణ కుమార్

సంగారెడ్డి మున్సిపాలిటీ: తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ రమణ కుమార్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ ప్రజలకు రాష్ట్ర ఆవిర్భావదినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఉషావిశ్వనాథ్, డీఎస్పీ రవీందర్ రెడ్డి, ఏఆర్‌డీఎస్పీ జనార్దన్, ఎస్‌బి ఇన్స్‌పక్టర్ మహేష్ గౌడ్, డీసీఆర్‌బి ఇన్స్‌పెక్టర్ రమేష్, డీపీఓ సూపరింటెండెంట్ వెంకటేశం, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతితో బాధ్యత పెరుగుతుంది

పటాన్‌చెరు డీఎస్పీ భీంరెడ్డి




పదోన్నతి పొందిన వారిని అభినందిస్తున్న డీఎస్పీ భీంరెడ్డి, సీఐ వేణు గోపాల్ రెడ్డి, క్రైం సీఐ లాలూ నాయక్

పటాన్‌చెరు టౌన్: పదోన్నతితో మరింత బాధ్యత పెరుగుతుందని పటాన్‌చెరు డీఎస్పీ భీంరెడ్డి అన్నారు. పటాన్ చెరు డీఎస్పీ కార్యాలయంలో పటాన్‌చెరు సీఐ వేణు గోపాల్ రెడ్డి, క్రైం సీఐ లాలూ నాయక్‌తో కలిసి ఎస్‌ఐగా పదోన్నతు పొందిన శ్రీనివాస్ గౌడ్‌కు, ఏఎస్ఐగా పదోన్నత పొందిన రామ్ మోహన్, నారాయణ, వీవీఎస్ఎన్ రాజు స్టార్ పెట్టారు. ట్రాఫిక్ పోలీసు స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న నరేశ్ కుమార్, మన్సూర్ ఖాన్ ఏఎస్ఐగా పదోన్నతి పొందారు. వారికి ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి స్టార్స్‌పెట్టారు.

కిలేడి

అధిక వడ్డీ ఆశచూపి ఓ మహిళ వద్ద రూ.41.40 లక్షలు కాజేసిన వైనం



మెదక్‌జోన్: అధిక వడ్డీ ఆశ చూపిన ఓ కిలాడీ లేడి ఓ మహిళ వద్ద నుంచి మూడేళ్లలో పలు విడతలుగా రూ.41.40 లక్షలు తీసుకుంది. తీరా ఆ డబ్బు ఇవ్వాలని అడిగితే నాకు నువ్వు ఏ డబ్బు ఇవ్వలేదంటూ బుకాయిస్తుందని సదరు మహిళ కన్నీటి పర్యంతమవుతోంది. మెదక్‌లోని జేఎస్‌రోడ్డులో నివాసముండే మద్దిబోయిన కృష్ణవేణి-హన్మంత్ దంపతులకు పాపన్నపేట మండలం పొడ్చన్‌పల్లిలో నాలుగు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అందులో కొంతకాలం క్రితం 2 ఎకరాల భూమి అమ్మగా రూ.60 లక్షలు వచ్చాయి. తెలిసిన వారి డబ్బు వడ్డీకి ఇస్తూ జీవనం సాగిస్తున్నారు. అయితే కృష్ణవేణికి పొడ్చన్‌పల్లి గ్రామానికి చెందిన ఓ మహిళ ద్వారా గజ్వేల్‌కు చెందిన వడ్డీవ్యాపారం చేసే ఓ మహిళతో పరిచయం ఏర్పడింది. నీవద్ద ఎంత డబ్బు ఉన్నా నాకు ఇస్తే అంత ఎక్కువ వడ్డీ ఇప్పిస్తానంటూ ఆ మహిళ చెప్పిన మాయమాటలు కృష్ణవేణి నమ్మింది. మూడేళ్ల వ్యవధిలో భర్తకు తెలియకుండా కృష్ణవేణి ఏకంగా రూ.32 లక్షలు ముట్టజెప్పింది. తన డబ్బు ఇవ్వమని సదరు మహిళను కృష్ణవేణి నిలదీయగా, వడ్డీతో సహా ఇస్తానని, రూ.7.20 లక్షలు ఇస్తే చిట్టీ ముగుస్తుందని, రాగానే ఇస్తానని చెప్పింది. అనుమానం వచ్చిన కృష్ణవేణి అసలు విషయం తన భర్త హన్మంత్, ఇతర కుటుంబసభ్యులకు చెప్పింది. హన్మంత్ సదరు మహిళతో ఫోన్‌లో మాట్లాడి ఫోన్‌పే ద్వారా రూ.7.20 లక్షలు ఆమె అకౌంట్‌కు పంపించాడు. మరో రూ. 2.20 లక్షలు ట్రాన్స్‌ఫర్ చేస్తే రూ.41.40 లక్షలు అవుతుందని, ఇందుకు రూ.57 లక్షలు ఇస్తానని చెప్పటంతో సరేనని చెప్పి కృష్ణవేణి తన భర్త, కొడుకు తీసుకుని గజ్వేల్‌లో ఉంటున్న ఆ మహిళ ఇంటికి వెళ్లింది. పలు నంబర్ల నుంచి ఫోన్ పే ద్వారా మరో రూ.2.20 లక్షలు పంపించారు. అయితే తీరా అనుకున్న సమయానికి డబ్బు అడిగితే మీరు నాకు ఏ డబ్బు ఇవ్వలేదంటూ సదరు మహిళ బుకాయించిందని బాధితులు వాపోయారు. దీంతో చేసేది లేక గజ్వేల్ సీఐకి గతనెల 26న ఫిర్యాదు చేసినట్టుబాధితులు పేర్కొన్నారు. కాగా సదరు మహిళను సీఐ స్టేషన్‌కు పిలిపించి విచారించగా, నాకు డబ్బులు ఇవ్వలేదని, వారివద్ద సాక్ష్యం ఉంటే కోర్టుకు వెళ్లమని చెప్పినట్టు గజ్వేల్ సీఐ తెలిపారు. ఈ విషయంపై మెదక్ పోలీస్‌స్టేషన్‌లోనే ఫిర్యాదు చేసుకోవాలని సీఐ చెప్పారు. దీంతో బాధితులు మెదక్ ఎస్పీకి కలిసి ఫిర్యాదు చేశారు.

5న మంత్రి హరీశ్‌రావు రాక

ఏర్పాట్లపై అధికారులతో కలెక్టర్ సమీక్ష



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు ఈ నెల 5న రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖామంత్రి హరీశ్‌రావు జిల్లాకు వస్తున్నారని కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో మంత్రి రాక ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు.

- ముందుగా ఏడుపాయల చేరుకొని అక్కడ నిర్మించిన యాగశాలను ప్రారంభిస్తారన్నారు. ఆపై హరిత హోటల్‌లో కొల్చారం జర్నలిస్టులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తారని తెలిపారు.
- అనంతరం పాపన్నపేట మండలం బాచారం, రాంతీర్థం గ్రామాల్లో డబుల్‌బెడ్‌రూం ఇళ్ల సముదాయాలు, పాపన్నపేటలో పశువైద్యశాల, సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తారని కలెక్టర్ తెలిపారు.
- మెదక్ పట్టణంలోని సాయి బాలాజీ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన విద్యుత్ విజయోత్సవం సమావేశంలో పాల్గొంటారన్నారు. 1000 మందితో విద్యుత్ దినోత్సవ కార్యక్రమ విజయవంతానికి తగు ఏర్పాట్లు చేయాలని విద్యుత్, డీఆర్డీఓ, మెప్మా అధికారులకు సూచించారు.
- మహిళా సమాఖ్య భవనం, ముదిరాజ్ భవనాలకు శంకుస్థాపనలు చేసి, డీసీసీబి బ్యాంకు భవనాన్ని ప్రారంభిస్తారన్నారు.
- సాయంత్రం 4 గంటలకు పీఆర్టీయూ సమావేశంలో పాల్గొని, అనంతరం బహిరంగ సభలో ప్రసంగిస్తారని తెలిపారు. 5:30 గంటలకు సురక్ష దినోత్సవంలో పాల్గొన్న అనంతరం తిరిగి హైదరాబాద్ బయల్దేరి వెళ్తారని తెలిపారు

నేటి రైతు దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

శనివారం నిర్వహించే రైతు దినోత్సవం విజయవంతానికి అన్ని ఏర్పాట్లు చేసి, అధికారులకు దిశా నిర్దేశం చేసినట్టు కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. శుక్రవారం సాయంత్రం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించింది. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ రైతు వేదికలను మామిడితోరణాలు, విద్యుత్ దీపాలతో అలంకరించామని తెలిపారు. ప్రతి గ్రామ పంచాయతీ నుంచి ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లతో సభా స్థలికి రైతులు సమయానికి చేరుకునేలా అధికారులకు తగు సూచనలిచ్చామన్నారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు ప్రతిమ సింగ్, రమేశ్, జిల్లా వ్యవసాయాధికారి ఆశా కుమారి తదితరులు పాల్గొన్నారు.

పండగ వాతావరణంలో దశాబ్ది ఉత్సవాలు



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శరత్

కలెక్టర్ డాక్టర్ శరత్

సంగారెడ్డి టౌన్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది సంబురాలు పండగ వాతావరణంలో ఆహ్లాదాన్ని కలిగించేలా జరగాలని కలెక్టర్ డాక్టర్ శరత్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులతో దశాబ్ది ఉత్సవాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు పట్టణ వ్యాప్తంగా పండగ వాతావరణం కనిపించాలన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ నగేష్, సంగారెడ్డి, పటాన్ చెరు డీఎస్పీలు, మున్సిపల్ కమిషనర్‌లు, రెవెన్యూ డివిజన్ అధికారి రవీందర్ రెడ్డి, తహసీల్దార్‌లు, ఏఓ పాల్గొన్నారు.

జిల్లాలో ఘనంగా అవతరణ వేడుకలు

సంగారెడ్డి మున్సిపాలిటీ: జిల్లాలో దశాబ్ది ఉత్సవాలతో పండగ వాతావరణం కనిపించింది. జిల్లా కేంద్రం సంగారెడ్డి తోపాటు ఆయా మండలాలు, గ్రామాలు ప్రభుత్వ కార్యాలయాలు అన్నింటిలో రాష్ట్ర అవతరణ వేడుకలు ఘనంగా జరిగాయి. సంగారెడ్డిలో మాజీ ఎమ్మెల్యే, టీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు చింతా ప్రభాకర్ ముందుగా తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, మున్సిపల్ చైర్మన్ విజయలక్ష్మి, వైస్ చైర్మన్ లతవిజేందర్ రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జేఎన్టీయూలో..

సుల్తాన్ పూర్ జేఎన్టీయూ కళాశాలలో రాష్ట్ర అవతరణ వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ నరసింహ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీఓ మధులత, ఎంపీపీ చైతన్య, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కిస్తారెడ్డి, అయ సర్పంచ్‌లు, కార్యదర్శులు, నాయకులు, గ్రామస్తులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



చింతా ప్రభాకర్ క్యాంపు కార్యాలయంలో అవతరణ వేడుకలు

తాళం వేసిన ఇంట్లో చోరీ

కొల్చారం(నర్సాపూర్): తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. మండలపరిధిలోని వరిగుంతం గ్రామానికి చెందిన తిమ్మయ్య గారి మొగులయ్య కల్లు అమ్మేందుకు వేరే గ్రామానికి రెండు రోజుల క్రితం తన ఇంటికి తాళం వేసి వెళ్లాడు. శుక్రవారం వచ్చి చూసేసరికి ఇంటి తాళాలు పగలగొట్టి ఉండడం గమనించాడు. పెట్టెలో దాచిన డబ్బుల కోసం వెతికాడు. ఇటీవల ధాన్యం అమ్మగా వచ్చిన రూ.85 వేల నగదుతో పాటు తులం బంగారు ఆభరణాలు కనిపించకుండా పోయాయని వాపోయాడు. పోలీసులకు సమాచారం అందించినట్టు మొగులయ్య విలేకరులకు చెప్పాడు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



మృతురాలి చేతిపై ఉన్న పచ్చబొట్టు

మెదక్ మున్సిపాలిటీ: పిట్లం చెరువులో శుక్రవారం గుర్తు తెలియని మహిళ శవం లభ్యమైనట్టు పట్టణ పోలీసులు తెలిపారు. మృతురాలి వయసు 35 ఏళ్లు ఉంటుందని, ఎడమ చేతిపై రుకవ్వ అనే పచ్చబొట్టు ఉన్నట్టు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు మెదక్ పట్టణ స్టేషన్ హౌస్ ఆఫీసర్ నంబరు 8712657913కు కాల్ చేయాలన్నారు.

పశువులపై పోలీసుల ఆరా

చేర్యాల(సిద్దిపేట): 57 పశువులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ శుక్రవారం సాయంత్రం 5 గంటల సమయంలో చుంచనకోట గ్రామ శివారులోని గుట్టల్లో పశువులు ఉన్నాయని వచ్చిన సమాచారం మేరకు వెటర్నరీ వైద్యుడు మనోహర్‌తో కలిసి అక్కడికి వెళ్లి చూడగా 50 ఎడ్లు, 7 కోడెదూడలు ఉన్నాయి. అక్కడ ఉన్న 20 మంది చుంచనకోట గ్రామ రైతులు, వేరే వ్యక్తులను ఈ పశువులు ఇక్కడకు ఎలా వచ్చాయని విచారించగా, కొనుగోలు చేశామన్నారు. అయితే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి, విచారణ అనంతరం తిరిగి వాటిని రైతులకు అప్పగిస్తామన్నారు.

ఓబీసీ సాధనకై చలో హైదరాబాద్



మాట్లాడుతున్న లింగాయత్ నాయకులు

సంగారెడ్డి టౌన్: ఓబీసీ సాధనకై జూన్ 4వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించే లింగాయత్ బహిరంగ సభను జయప్రదం చేయాలని వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం జిల్లా అధ్యక్షుడు పృథ్వీరాజ్ అన్నారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సభకు జిల్లా నలుమూలల నుండి తరలి రావాలని, లింగాయత్‌ల ఐక్యతను చాటాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్ పాటిల్, కోశాధికారి రాజు తదితరులు పాల్గొన్నారు.

‘సోనియా గాంధీతోనే తెలంగాణ ఏర్పడింది’



సోనియాగాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

హత్నూర(సంగారెడ్డి): తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ తోనే సాధ్యమైందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి హకీం అన్నారు. శుక్రవారం తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని హత్నూర మండలం దౌల్తాబాద్ తెలంగాణ తల్లి విగ్రహం వద్ద కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో విద్యార్థుల ఆత్మహత్యలను చూసి చెల్లించిపోయిన సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు పార్లమెంటులో బిల్లు పెట్టిందన్నారు. ప్రస్తుతం దొరల పాలన కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ మైనార్టీ విభాగం మండల అధ్యక్షుడు కిష్టయ్య, సర్పంచ్ కొన్యాల వెంకటేశం, యువజన కాంగ్రెస్ నర్సాపూర్ నియోజకవర్గ అధ్యక్షులు రియాజ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

11న సాహితీ దినోత్సవం

కొండాపూర్(సంగారెడ్డి): తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 11న సాహితీ దినోత్సవ కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాధికారి వేంకటేశ్వర్లు తెలిపారు. ఈ కవి సమ్మేళనంలో పాల్గొనే కవులు, తెలంగాణ అస్తిత్వం, తెలంగాణ సాధించిన ప్రగతి ప్రతిబింబించేలా కవితలు ఉండాలన్నారు. కవితలను ఈనెల 6వ తేదీ సాయంత్రంలోపు జిల్లా విద్యాధికారి కార్యాలయంలో జిల్లా సైన్స్ విద్యాధికారి రాజేష్‌ను సంప్రదించాలన్నారు. సాహితీ దినోత్సవంలో పాల్గొనే కవుల కవితలతో పుస్తక సంకలనం తేనున్నారని తెలిపారు. కవితలు లేదా కవితల సంపుటి పుస్తక రూపంలో ప్రచురించి ఉండాలని, లేదా ప్రచురించబోయే కవితల పుస్తక సంపుటి రూపంలో సమర్పించాలన్నారు. కవితలు తెలుగు, ఉర్దూ మాధ్యమంలో ఉండాలని సూచించారు.

సెల్ టవర్ ఎక్కి యువకుడి హల్‌చల్

- తెలంగాణ వచ్చినా.. న్యాయం జరగలేదని ఆరోపణ
- నచ్చజెప్పి కిందకి దింపిన నాయకులు, పోలీసులు



మాట్లాడుతున్న అన్వర్

జిన్నారం(పటాన్‌చెరు): తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన నాటి నుంచి నేటి వరకు తమకు ఎలాంటి న్యాయం జరగలేదని ఆరోపిస్తూ ఓ యువకుడు సెల్‌టవర్ ఎక్కి నిరసన వ్యక్తం చేశాడు. ఈ ఘటన గుమ్మడిదల గ్రామంలో శుక్రవారం జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గుమ్మడిదల గ్రామానికి చెందిన అన్వర్ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన నాటి నుంచి నేటి వరకు తమకు ఎలాంటి న్యాయం జరగటం లేదని ఆరోపిస్తూ సెల్ టర్ ఎక్కి నిరసన తెలిపాడు. నిరుపేద కుటుంబమైన తమకు డబుల్‌బెడ్ రూం, మూడెకరాల భూమి ఇవ్వలేదని ఆరోపించాడు. సెల్‌టవర్ ఎక్కిన యువకుడిని కిందికి దింపేందుకు పోలీసులుయ త్నించారు. జెడ్పీటీసీ సభ్యుడు కుమార్‌గౌడ్ చొరవతీసుకొని సెల్‌టవర్ ఎక్కి అతడితో మాట్లాడాడు. న్యాయం చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో కిందికి దిగాడు. అనంతరం యువకుడు అన్వర్ మాట్లాడుతూ ఉద్యమంలో తాము కూడా పాల్గొన్నామని, తమకు మాత్రం తొమ్మిది ఏళ్ల తెలంగాణలో ఎలాంటి న్యాయం జరగలేదన్నారు. ప్రభుత్వం స్పందించి నిరుపేదలకు డబుల్‌బెడ్‌రూం ఇల్లు, మూడెకరాలు భూమి ఇవ్వాలని డిమాండ్ చేశాడు.

ఫోన్ పోయిందనే దిగులుపడొద్దు

పటాన్‌చెరు సీఐ వేణు గోపాల్ రెడ్డి



ఫోన్ అందజేస్తున్న సీఐ వేణు గోపాల్ రెడ్డి, క్రైం సీఐ లాలు నాయక్

పటాన్‌చెరు టౌన్: మొబైల్ ఫోన్ పోయిందని దిగులుపడొద్దని సీఈఐఆర్ ద్వారా ఫోన్ ట్రాక్ చేయవచ్చని పటాన్‌చెరు సీఐ వేణు గోపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం పటాన్‌చెరు పోలీసు స్టేషన్‌లో సెల్‌ఫోన్ పోగొట్టుకున్న ఇద్దరికి వారి ఫోన్ లను అందజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌కు చెందిన ఇరువురు పది రోజుల క్రితం తమ ఫోన్ పోగొట్టుకొన్నారు. వెంటనే వారు పటాన్‌చెరు పోలీసు స్టేషన్‌లో సంప్రదించారు. వారిని ముందుగా మీ-సేవలో ఫిర్యాదు చేయించి, అనంతరం సీఈఐఆర్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేయించారు. పోగొట్టుకున్న రెండు ఫోన్ లను గుర్తించి బాధితులకు శుక్రవారం అందజేశామన్నారు. ప్రజలు ఎవరైనా తమ సెల్‌ఫోన్ పాగొట్టుకుంటే సీఈఐఆర్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

వేర్వేరు ఘటనల్లో చికిత్స పొందుతున్న ఇద్దరు మృతి

గాంధీలో చికిత్స పొందుతూ..



నర్సింహులు (ఫైల్)

జిన్నారం(పటాన్‌చెరు): అక్రమ సంబంధాలు పెట్టుకోవడాన్ని ప్రశ్నించిన భర్తపై భార్య డీజిల్ పోసి హత్య చేసేందుకు యత్నించిన ఘటన జిన్నారం మండలం ఊట్ల గ్రామ పంచాయతీ పరిధి రాంనగర్ కాలనీలో మే 27న జరిగిన విషయం తెలిసిందే. కాలిన గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి శుక్రవారం మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. రాంనగర్ కాలనీకి చెందిన నర్సింహులు(35)కు యాదమ్మకు 17 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ముగ్గురు సంతానం. భార్య యాదమ్మ ఇతర వ్యక్తులతో అక్రమ సంబంధం పెట్టుకోవటంతో భర్త నర్సింహులు ఆమెను తరచూ మందలిస్తున్నాడు. కాగా మే 27వ తేదీ రాత్రి భార్యాభర్తలు ఘర్షణ పడ్డారు. భర్తను వదిలించుకోవాలని చూసిన భార్య యాదమ్మ రాత్రి భర్త నిద్రిస్తున్న సమయంలో అతడిపై డీజిల్ పోసి నిప్పంటించింది. నర్సింహులు కాలిన గాయాలతో బయటకు రావటంతో చుట్టుపక్కల వారు గమనించి ఆతడిని వెంటనే ఆస్పత్రికి తరలించారు. నర్సింహులు గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. నర్సింహులు మృతి పట్ల గ్రామస్తులు విచారం వ్యక్తం చేశారు. హత్య చేసిన భార్య యాదమ్మను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ఆర్వీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ..



కనకరాజు మృతదేహం

వర్గల్(గజ్వేల్): బైక్ చెట్టుకు ఢీకొట్టిన ఘటనలో గాయపడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. గౌరారం ఎస్ఐ సంపత్‌కుమార్ వివరాల ప్రకారం.. గత నెల 17న సీతారాంపల్లికి చెందిన రాజపేట కనకరాజు(40) మరో వ్యక్తితో కలిసి బైక్ మీద అచ్చాయిపల్లిలో వివాహానికి బయల్దేరాడు. బైకు సీతారాంపల్లి శివారులో అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ఈ ఘటనలో గాయపడిన కనకరాజును ఆర్వీఎం ఆస్పత్రికి తరలించగా, చికిత్సపొందుతూ గురువారం మృతిచెందాడు. మృతుడి భార్య భార్గవి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ తెలిపారు.

ఆర్థిక సమస్యలతో గృహిణి ఆత్మహత్య



స్వాతి(ఫైల్)

మనోహరాబాద్(తూప్రాన్): ఆర్థిక సమస్యలతో ఓ గృహిణి ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ సందీప్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం...మండలపరిధిలోని కాళ్ళకల్‌కు చెందిన చెనిగారపు స్వాతి(30) ఆర్థిక సమస్యలతో గురువారం ఇంట్లోనే విషం తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం మేడ్చల్‌లో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. మృతురాలి సోదరుడు రాజు ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ఆస్పత్రికి తరలించారు. మృతురాలికి ఒక కూతురు, కుమారుడున్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వృద్ధుడు మృతి

సంగారెడ్డి టౌన్: రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. ఈ సంఘటన సంగారెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం పోతిరెడ్డిపల్లి చౌరస్తా సమీపంలో నేషనల్ హైవేపై గుర్తు తెలియని వృద్ధుడు (65) రోడ్డు దాటుతున్నాడు. అదే సమయంలో చౌరస్తా నుంచి సదాశివపేట వెళుతున్న క్రేన్ ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు న మోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు బురిడీ

పటాన్‌చెరు టౌన్: సైబర్ వలలో ఇద్దరు మహిళా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు మోసపోయారు. అమీన్‌పూర్ పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. అమీన్‌పూర్ పరిధిలోని ప్రణీత్ ప్రణవ్ ప్రనోరమకు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగినికి మే 10వ తేదీన పార్ట్ టైం జాబ్ ఆఫర్ అంటూ మెసేజ్ వచ్చింది. దీంతో ఆమె తన వివరాలను నమోదు చేసింది. టాస్క్ పేరిట నగదు పెట్టుబడి పెట్టించాడు. చివరికి తాను పెట్టిన రూ.1.20 లక్షలు, రెట్టింపైన నగదును ఇవ్వాలని మెస్సేజ్ చేయగా స్పందన రాలేదు. దీంతో ఆమె తాను మోసపోయినట్టు గుర్తించి సైబర్ క్రైమ్ లో ఫిర్యాదు చేసి అనంతరం అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. అదేవిధంగా అమీన్ పూర్ పరిధిలోని బీరంగూడ జయలక్ష్మీ నగర్‌కు చెందిన మరో సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి మే 29వ తేదీన పార్ట్ టైం ఉద్యోగం మెసేజ్ వచ్చింది. దీంతో బాధితురాలు సాఫ్ట్ వేర్ ఉద్యోగిని తన వివరాలను నమోదు చేసి అపరిచితులు చెప్పిన విధంగా నగదు పెట్టుబడి పెట్టింది. చివరకు తాను పెట్టిన రూ.8.40 లక్షలు, రెట్టింపైన నగదును ఇవ్వాలని అడగగా స్పందించలేదు. దీంతో బాధితురాలు తాను మోసపోయినట్టు గ్రహించి అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేపట్టారు.

చట్టాలపై రైతులకు అవగాహన అవసరం

నారాయణఖేడ్: చట్టాలపై రైతులకు అవగాహన ఉండాల్సిన అవసరం ఉందని జిల్లా న్యాయసేవాధికారిత సంస్థ కార్యదర్శి హన్మంత్‌రావు అన్నారు. నారాయణఖేడ్ మండలం జూకల్ శివారులోని రైతు వేదికలో శుక్రవారం రైతులకు వ్యవసాయ న్యాయ సలహాలపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడారు. అన్యాయం జరిగిన రైతులకు చట్టపరంగా న్యాయం చేసేందుకు న్యాయసలహా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఎరువులు, విత్తనాలతోపాటు వ్యవసాయానికి సంబంధించి మరే విషయాలలోనైనా కానీ అన్యాయం జరిగితే న్యాయసలహా కేంద్రంలో రైతులు ఫిర్యాదు చేయవచ్చన్నారు. న్యాయసలహా కేంద్రంలోని బీఎల్‌పీ ద్వారా సమస్యలను త్వరగా పరిష్కారం లభిస్తుందన్నారు. రైతులు సలహా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రాజీమార్గమే రాజమార్గం

రాజీమార్గమే రాజమార్గమని జిల్లా న్యాయసేవాధికారిత సంస్థ కార్యదర్శి హన్మంత్‌రావు అన్నారు. ఖేడ్‌లోని కోర్టులో శుక్రవారం న్యాయవాదులు, పోలీసులు, ఎక్సైజ్‌శాఖ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 10న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు. కక్షిదారులు పరస్పర అంగీకారంతో రాజీకాదగ్గ కేసులను లోక్‌అదాలత్‌లో పరిష్కరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తి శ్రీధర్ మంథని, డీఎస్పీ వెంకట్‌రెడ్డి, డివిజన్ పోలీసు, ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.